

# ఛలి

రచన:

నంద్యాల కొండమాచార్యులు, బి. ఏ.

ఛలి పులి వంటిది. ఎటువంటి వాడైనా ఈ ఛలిచేతిలో నలిగిపోనివాడంటూ లేడు.

శ్రీ కృష్ణభగవానుడు అర్ధాంగి సహాయంతో నరకుణ్ణి జయించినట్టుగానే, ప్రతి గృహస్థూ తన అర్ధాంగి సహకారంతో ఈ ఛలి రాక్షసుణ్ణి జయిస్తుంటాడు.

కార్తీకమాసంలో కాస్త ప్రారంభమై, మార్గశిరంలో మధ్యస్థంగావుండి పుష్యమాసంలో పుష్కలంగా వుంటుంది ఛలి.

ఈ ఛలికాలంలో మంచి ఉన్ని దుప్పట్లుకలవాళ్లు, పొడుగాటిభార్యలు గల పొట్టిభర్తలు అదృష్టవంతులు.

ఉన్నిదుప్పటి కలవాడు కాళ్లదగ్గర నుంచి, కళ్లవరకూ మునుగుపెట్టుకుంటే ఆ ఉన్నికోటును ఛలి జయించలేదు. వెచ్చని నిద్రపడుతుంది.

పొట్టిభర్త ఉన్నిదుప్పటి కలవాడి కంటె గూడా పెద్ద అదృష్టవంతుడు. అతనిభార్య ఉన్నిదుప్పటి కన్నా పదింతలు శక్తికలదై యుంటుంది. ఆమె విశాలమయిన కౌగిలిలో ఈ పొట్టి భర్త రేణువులాగా ఇమిడిపోయి ఛలి బాధనుంచి విముక్తిపొందుతాడు.

వృద్ధులమీదకి, బ్రహ్మచారుల మీదకి ఛలి రాక్షసి ఒంటికాలిమీద పోతుంటుంది. ఒకవృద్ధకవి కటికపేదరికంలో వున్నాడు. కప్పుకోవటానికి కూడా సరైన గుడ్డలేక చాలా బాధపడుతున్నాడు. ఛలిబాధపడలేక ఒక ఛలి కాలం రాత్రిపూట ఒకపద్యం చెప్పాడు. ఆ పద్యభావం యిది:

“ఓ ఛలిరాక్షసీ నాబోటి దిక్కుమొక్కులేని వృద్ధుల నెందుకింత బాధపెడతావు? గృహాంతర్భాగాల్లో మెత్తటి శయ్యలమీద గాఢమయిన కౌగిళ్లలో కరగిపోయే యువదంపతులవద్దకు వెళ్లరాదూ? ఊహూ! అలా వెళ్లవు. అంత ధైర్యమెక్కడిది నీకు? వారి బిగుకౌగిళ్ల మధ్యపడి నలిగిచస్తావని నీకు భయం కాబోలు!”

ఎంత చక్కటి శృంగారపూరితమైన భావమో చూడండి!

ఛలికాలపుకౌగిళ్ళు చాలా బలమయినవి. ఛలికాలపు కౌగిళ్లకున్నంతబలం విద్యుచ్ఛక్తికి కూడా లేదు. ఛలికాలపు కౌగిలి ఎంత బలమైనదంటే ఇంత ఛలిలోను వేడికలిగించి చెమటను పుట్టించేటంత బలమైనది.

ఛలికాలంలో పెరిగే పైరగోంగూరలాగా, ఛలికాలంలో వచ్చే వంకాయల్లాగా ఛలికాలపుకౌగిళ్ళు మంచి రుచి కలవి.

తతిమ్మా కాలాలలోకంటే ఛలికాలంలోనే కౌగిళ్ళవిలువ అర్థం అవుతుంది.

ఛలి భార్యాభర్తలమధ్య ఎంతో సహకారాన్ని పెంపొందిస్తుంది. భార్యాభర్తలు పగలు పోట్లాడుకున్నా ఈ ఛలి కాలంలో రాత్రికల్లా రాజీపడాల్సిందే. ఏవిషయంమీదో కీచులాడుకొని పగలెల్లా ఎడమొహం పెడమొహంతో తిరిగిన దంపతులను రాత్రికల్లా ‘ఛలి’ మందలించి ఏకశయ్యమీదకి చేరుస్తుంది.

మా పక్కింటి పేరావధానికి ఈ ‘హేమంతం’—అంటే ఛలికాలం దేవుడిచ్చిన వరంలాంటిది. పేరావధాని భార్య సింగమ్మ తరచు అవధానితో పోట్లాడుతుంటుంది. ఒక్కొక్కపుడు పోట్లాడి తాను అన్నంతిని భర్తకు పెట్టకుండా ముసుగుతన్ని పడుకుంటుంది. అపుడు పాపం పేరావధానే పెట్టుకు తింటాడు. ఒక్కొక్కపుడు వంటకూడా చేయదు అపుడు పేరావధానే చేయి కాల్చుకుంటాడు. ఏం చేస్తాడు పాపం! ఎండాకాలపురోజులలో అయితే భర్తతో పోట్లాడి సింగమ్మ ఒకోసారి నెలరోజుల వరకూ అతగాడితో మాట్లాడేదికాదు. కాని యీ ఛలికాలంలో పగలు భర్తతో పోట్లాడినా రాత్రికల్లా రాజీకి వస్తుందిట సింగమ్మ. తనే ఏదో కల్పించుకొని మాటలాడి అవధానిని కవ్వించి, నవ్వించి గతాన్ని మరిపించి రాత్రికి మురిపిస్తుందట. సింగమ్మలాటి గయ్యాళి భార్యలకు ‘ఛలి’కాలం ఒక

శాపంలాంటిది. పగలల్లా భర్త నెంత దూషించి అడిపోసుకున్నా, రాత్రివూట అతడికి లొంగక తప్పదు యీ ఛలి రోజులలో.

స్త్రీయొక్క వక్షోజాల కఠినత్వం ఛలికాలంలోనే బాగా తెలుస్తుంది. స్త్రీ చెక్కిళ్ళు పూలలాగా మృదువైనవని మైసూర్‌పాక్‌లకన్నా రుచ్యమైన వని హేమంతం రుజువుచేస్తుంది. స్త్రీ అబల కాదు సబలయని ఛలికాలపు కౌగిళ్ళు నిరూపిస్తాయి.

నిజంగా ఈ హేమంతఋతు వెంతో మధురమయింది. గొప్ప గొప్ప కవులకు శృంగారభావముల పుట్టించిందీ హేమంతమే.

కంకంటి పాపరాజు, కాళిదాసు మొదలగు కవులీ హేమంతాన్ని శృంగారభావయుక్తంగా వర్ణించారు.

కంకంటి పాపరాజు తన ఉత్తర రామాయణములో హేమంతఋతువును వర్ణించాడు. ఆ వర్ణనలో "ముద్దుగుమ్మలమొగంబులుజూడనే" గాని అనే పద్యం మనోహరమయింది. ఆ పద్య భావం ఏమంటే, హేమంతంలో అంటే ఈ ఛలికాలంలో పురుషులు కాంతల ముఖాలు చూడకోరుతారట కాని చందమామను చూడటానికికూడా యిష్టపడరట. యువతుల మందహాసముల చెంత నిలుచుంటారట కాని పండు వెన్నెలలో నిలవ నిచ్చగించరట. ఆడవాళ్ల అధరామృతమనే పానకాన్ని త్రాగెదరట కాని నిజంగా పానకంత్రాగ కోరరట. చెలువలస్తనము లనే కొండలు ప్రాకటానికి కోరుతారట కాని నిజమైన పర్వతాలు ఎక్క నిచ్చగించరట. ఆడవాళ్ల నాభులనే సరస్సులలో క్రీడలాడెదరు గాని నిజమైన సరస్సులలో జలకమాడ ఉత్సహించరట. సుగంధంతోకూడిన మానినుల ఉచ్ఛ్వాస నిశ్వాసాలగాలి కోరుతారట కాని విసన కర్రతో విసురుకోవటానికి యిష్టపడరట. ఈవిధంగా మధురంగా వర్ణించాడు పాపరాజు,

మహాకవి కాళిదాసు తన ఋతుసంహార కావ్యంలో హేమంతఋతు వర్ణనం రసవత్తరమైన శృంగారభావాలతో నింపేశాడు.

హేమంత ఋతువర్ణనంలోని ఐదో శ్లోకంలో ఛలికాలంలో స్త్రీల కార్యక్రమాన్ని వర్ణించాడు. ఈ ఛలిరోజుల్లో సాయంకాలంకాగానే స్త్రీలు తమ శరీరం మీద చందనంపూసుకొని, తమ కమలములవంటి ముఖాల మీద అందం కోసం అనేక విధములైన మెరుగులు దిద్దుకొని తమ కేశాలను సుగంధిత తైలాలతో ముడుచుకొని రాత్రి రతికేళికి తయారవుతారట.

ఆరో శ్లోకం మరీ శృంగార రస పూరితమే కాకుండా కాళిదాసు ఆలోచనా చమత్కృతికి కూడా నిదర్శనం. తెల్లవారింతరువాత రాత్రి రతికేళితో అలసిపోయిన స్త్రీలు నవ్వవలసిన సమయంలో కూడా సరిగా నోరుతెరచి నవ్వటానికి భయపడ్తున్నారట. ఎందుచేతనంటే నవ్వితే రాత్రి రతికేళి సమయంలో ప్రియుడిచేత కొరకబడినట్టి పెదిమలమీది గాయాలు ఎక్కడ నలుపుపుట్టి నొప్పి పుడతయ్యానే భయం కొద్దీ నవ్వరట.

మంచుబిందువులను వర్ణిస్తూ, స్త్రీల ఆకర్షణీయమైన స్తనములు ప్రియుల చేతఃబడి మర్దింపబడి పీడింపబడుట చూచిన హేమంతము కార్చిన కన్నీటి చుక్కలవలె వున్నవట.

వివిధములైన పుష్పసౌరభం శరీరాల్ని సుగంధితంచేయగా మధురవాసనలనీను ఉచ్ఛ్వాస నిశ్వాసములు వ్యాపించగా ప్రేయసీ ప్రియులు గాఢమైన తమకంతో బిగుకౌగిళ్లలో నిద్రిస్తారట.

ఈ ఛలిరోజుల్లో ఎక్కువగా ప్రియులు ప్రేయసీలమ ఖులపెదిమలమీద దంతక్షతాలు కలిగిస్తారు. స్తనములమీద నఖక్షతములు కలిగించి మనసార ప్రేమిస్తారు.

హేమంత ఉదయానే కనుపించే ఒక స్త్రీని ఇలా వర్ణించాడు కాళిదాసు. ఒకస్త్రీ ఉదయానే అద్దం చేతిలోపట్టుకొని లేతఎండలో కూర్చుని ముఖాన్ని తిరిగి సింగారించుకుంటూ రాత్రి ప్రియుడిచేత రసము పీల్చివేయబడి, ప్రియుడి దంతముల క్షతులకు గురియయిన అధరోష్టాన్ని అద్దంలో లాగి లాగి పరీక్షించుకుంటున్నదట.

భోగసౌఖ్యాలలో రాత్రల్లా నిద్రలేకుండా మేల్కొన్న వేరొక యువతి కళ్ళు ఎఱ్ఱబడగా, కంఠము వ్రేలాడబడగా, కేశములు చెల్లాచెదురుకాగా ఆమె ప్రాతఃకాలపు సూర్యకాంతిలో బడలికగా నిద్రిస్తున్నదట.

నఖక్షతములు నిండిపోయిన శరీరముగల వేరొక యువతి రేగినజుట్టు కళ్లమీద పడుచుండగా, రాత్రి రతికేళితో అలసినతనువును మాటిమాటికి చూచుకొని సిగ్గుపడుతూ తన చీరె సింగారించుకుంటున్నదట.

ఈ ప్రకారం రాత్రల్లా ఉపభోగములలో అలసిపోయిన స్త్రీలు రోమాంచములైన తమ తొడలమీద స్తనముల మీద హేమంత ఉదయాన తైలం మర్దించుకొంటున్నారట.

మహాకవి కాళిదాసు ఈ హేమంతఋతువర్ణనాన్ని ముగిస్తూ తన గుణాలచేత మనస్సులను సంతోషపెట్టే టటువంటిన్నీ స్త్రీల చిత్తాన్ని హరించే టటువంటిన్నీ, గ్రామాదులచుట్టూ పంట చేలను కల కల లాడేట్టు చేసేటటువంటిన్నీ మంచుకురిసే టటువంటిన్నీ, సారసములు కూసే టటువంటిన్నీ హేమంతఋతువులో భగవంతుడు మీకు సుఖాన్నిచ్చుగాక అన్నాడు.

★